క్లుప్తంగా

పళ్లికొండేశ్వరస్వామి సేవలో డీఎఫ్ఓ



ప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

నాగలాపురం: సురుటుపల్లిలోని శ్రీపల్లి కొండేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి నూకవారపు నాగేశ్వరరావు దర్శిం చారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీస్వా మి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈవో కె.రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



సత్కారం అందుకుంటున్న హెచ్ఎం లలిత

సత్యవేడు: ఉత్తమ సేవలతో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ కే.రవి అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.లలిత స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎంఈఓ, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ2 ఉష పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు, అధికారులు ఆమెను సత్కరించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పన్ను వసూళ్లు



పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలో మున్సిపల్ సిబ్బంది పన్ను వసూళ్లను ముమ్మరం చేశారు. బుధవారం కుమారస్వామి తిప్ప, పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పన్ను బకాయిలు వసూలు చేశారు. బకాయి ఉన్న వారిని త్వరితగతిన చెల్లించాలని కోరారు. ఆర్ఐ నారాయణరెడ్డి, సిబ్బంది బాలచంద్ర, రవికాంత్, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కార్యాలయంలో కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

నియామక పత్రాల అందజేత

నాగలాపురం: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ ఆయాలుగా ఎంపికైన వారికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు నియామకపత్రాలు అందజేశారు. రాజుల కండ్రిగ పంచాయతీ జానికాపురం, ఎస్ఎస్‌పురం, సురుటుపల్లి అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలకు నియామక పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ పీఎంకే బాబు, సర్పంచ్ చిన్నదొరై సుధా, జెడ్పీటీసీ సుమతి, ఎంపీపీ సింధూ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యంత్ర సాగుతో అధిక దిగుబడులు

సత్యవేడు: రైతులు వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతి పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మదనంబేడు రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఆధునిక పరికరాలతో సేద్యం చేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. సూక్ష్మపోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఎకరాకు నాలుగు బస్తాల జిప్సం ఎరువును రెండవ కలుపుతీత ముందు పొలంలో చల్లాలని సూచించారు. ఏఓలు మురళి, శ్రీనివాస్, వీహెచ్ఏ మురళి పాల్గొన్నారు.

వరకట్న వేధింపులతో గర్భిణి ఆత్మహత్య

- భర్త,అత్తపై కేసు నమోదు



జాస్మిన్ (ఫైల్)

శ్రీకాళహస్తి : వరకట్నం వేధింపులు తాళలేక ఏడునెలల గర్భిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీకాళహస్తి మండలం ఇసుకగుంటలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇసుకగుంటకు చెందిన అక్బర్‌బాషా కుమార్తె షేక్ జాస్మిన్(23)ను అదే గ్రామానికి చెందిన అమీర్ సొహైల్‌కు ఇచ్చి మూడేళ్ల కిందట వివాహం జరిపించారు. అమీర్ సొహైల్‌కు కట్నం, లాంఛనాలు ఇచ్చాడు. అప్పటి నుంచి వారి దాంపత్యం సవ్యంగానే సాగడంతో రెండేళ్ల కిందట వారికి ఓ బాలుడు జన్మించాడు. ప్రస్తుతం జాస్మిన్ ఏడునెలల గర్భిణి. ఇటీవల అమీర్ సొహైల్, అతని తల్లి ఖాదర్‌బీ ఆమెను పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించడం మొదలుపెట్టారు. వేధింపులను భరించలేక జాస్మిన్ బుధవారం ఇంట్లో ఉరేసుకుంది. అత్తింటి కట్నం దాహానికి తన కుమార్తె మృతి చెందినట్లు అక్బర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. జాస్మిన్ భర్త అమీర్ సొహైల్, అతని తల్లి ఖాదర్‌బీపై వరకట్నం కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం

- సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా చర్యలు
- ప్రజాప్రతినిధులు సూచించిన సమస్యలపై స్పందించాలి
- సబ్ సెంటర్ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు
- అధికారుల సమీక్షలో తిరుపతి ఎంపీ గురుమూర్తి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

నారాయణవనం: మండలంలో అభివృద్ధి పనులను త్వరతిగతిన పూర్తి చేస్తే, సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా తాను శ్రద్ధ తీసుకుంటానని తిరుపతి ఎంపీ, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త మద్దిల గురుమూర్తి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అన్నిశాఖల అధికారులతో ఎంపీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి అధ్యక్షన జరిగిన సమావేశంలో గురుమూర్తి మాట్లాడుతూ 20 రోజుల్లో అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. జరిగిన పనులకు తక్షణం ఎంబుక్‌లను రికార్డు చేయిస్తే, ఉన్నతాధికారులతో చర్చించి, బిల్లులు తక్షణం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కొండలచెరువు గ్రామంలో సబ్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు గ్రావెల్ రోడ్ల ఏర్పాట్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని సూచించారు. పూల సాగుకు అనుకూలమైన మండలంలో రైతులను ప్రోత్సహించాలని, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ) ఏర్పాటుపై అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి శోభారాణికి సూచించారు.

నేత కార్మికుల సమస్యలు సీఎం దృష్టికి

పవర్‌లూమ్స్‌తో వచ్చే కరెంట్ బిల్లుతో సంక్షేమ పథకాలు అందుకోలేక పోతున్న చేనేత కార్మికుల సమస్య పరిష్కారం కోరుతూ ఇదివరకే వెంకటగిరి సామాజిక సాధికార యాత్ర సందర్భంగా తీర్మానం చేసినట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. సమస్యపై మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండలంలో సమస్యలని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గృహనిర్మాణంలో చిన్న చిన్న అడ్డంకులను సాకుగా చూపకుండా పేదలకు లబ్ధి చేకూరేలా చొరవ చూపాలని తెలిపారు. సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల పట్ల అధికారులు సాదరంగా వ్యవహరించాలని, వారి సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు. ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులు అధికారులతో సమన్వ యపర చుకుంటూ సామరస్యంతో పనులను చేసుకోవాలన్నారు. సమావేశంలో పీఆర్ డీఈ మధుసూదన్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ ప్రమీల, అన్ని శాఖల మండల అధికారులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, కో ఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఉరప్ప, కైలాసకోన ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లేదు

బుచ్చినాయుడుకండ్రిగ: 'ఎమ్మెల్యే అంటే అబ్రివేషన్ తెలియని నిన్ను అసెంబ్లీ మెట్లు ఎక్కించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి లేదని' కోనేటి ఆదిమూలంకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అరణి సుధాకర్‌రెడ్డి సూచించారు. ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఏ కార్యకర్త అయిన, ఏ నాయకుడైనా మంత్రి పెద్దిరెడ్డి వద్దకు వెళితే గౌరవించి, పని చేసి పంపే మహోన్నతమైన వ్యక్తిని తెలిపారు. '2014, 2019లో నీకు పెద్దిరెడ్డి ఆశీస్సులతోనే సీటు వచ్చింది, టీడీపీ రక్తం దాగి ఉన్న నువ్వు మేక వన్నె పులిలా' పెద్దిరెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదు. దళితులకు అన్యాయం జరిగిందని చెబుతున్నావు..గురుమూర్తి దళితుడు కారా' అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు ఇచ్చే ప్యాకేజీ కోసం ఆశపడి తల్లి లాంటి పార్టీపై, మంత్రిపై బురద చల్లిన ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుని తగిన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

ఉద్యోగమేళాలో 19మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం జేకేసీ విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 19మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చెన్నైకి చెందిన కాలహన్ సర్వీస్, అక్సోర పరిశ్రమ ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీలత, అధ్యాపకులు, పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

సిఫాయి భరోసా అందజేత





ఏర్పేడు: సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, శ్రీకాళహస్తిలో..

ఏర్పేడు: మండలంలోని మడిబాక పంచాయతీ రాజులకండ్రిగలో మునెమ్మ కుటుంబ సభ్యులకు బుధవారం సిపాయి భరోసా అందింది. మునెమ్మ(59) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం గ్రామానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే 41 రకాల నిత్యావసర సరకులను అందజేశారు. సర్పంచ్‌లు చెంగల్‌రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నంరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రవి యాదవ్, మధుసూదన్ రాజు, మునికృష్ణారెడ్డి, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: పట్టణ సమీపంలోని బృందమ్మ కాలనీలో కళత్తూరు నాగరాజు కుటుంబానికి సిపాయి భరోసాను ఎమ్మెల్సీ సుబ్రమణ్యం అందజేశారు. ఇటీవల నాగరాజు మృతి చెందారు. బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు సిపాయి భరోసా కింద నెలకు సరిపడా సరుకులను అందజేశారు. వైఎసార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు తలపా దామోదర్‌రెడ్డి, నాయకులు రత్నం రెడ్డి, ఆంటోనీ, మునిరాజా, తిరుపాల్, భద్ర, మారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సర్వత్రా గౌరవం



సత్కారం అందుకుంటున్న గురునాథం, గోపి

శ్రీకాళహస్తి : వృత్తిపట్ల నిబద్ధతతో ఉత్తమ సేవలందించే ఉద్యోగులకు సర్వత్రా గౌరవం లభిస్తుందని శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. బుధవారం మండలంలోని వేడాం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గురునాథం, తెలుగు ఉపాధ్యాయుడు గోపి ఉద్యోగ విరమణ సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు వారిని సత్కరించారు. ఎంఈవోలు బాలయ్య, నాగేశ్వర్‌రావు, లక్ష్మీపతి, సీఆర్ఎం టీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మంచి రోజులు



సత్యవేడులో ఆదిమూలం, సుమన్‌కుమార్ దిష్టి బొమ్మలు దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు,



పిచ్చాటూరు: ఆదిమూలం డౌన్ డౌన్ అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన

- ఆదిమూలం పార్టీ వీడడంపై వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆనందం
- తాయిలాల కోసమే పెద్ది రెడ్డిపై విమర్శలు
- వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచారని దిష్టిబొమ్మ దహనం

సత్యవేడు: ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కొడుకు పార్టీని వీడడంతో వైఎస్సార్ సీపీకి మేలు జరుగుతుందని, టీడీపీకి గ్రహణం పట్టడం తథ్యమని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. సత్యవేడుకు పట్టిన గ్రహణం వదలిపోయిందని స్వీట్లు పంచారు. కుమ్ముక్కు రాజకీయాలు చేసే వారిని ప్రజలు గుర్తిస్తున్నారని హెచ్చరించారు. ఆదరించిన పార్టీని వీడి టీడీపీలో చేరడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఆరోపిస్తూ బుధవారం పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆయన కుమారుడు కోనేటి సుమన్ కుమార్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సత్యవేడు మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కేవీ.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ తాయిలాల కోసం రెండు సార్లు సత్యవేడు ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించిన పెద్దిరెడ్డిపై కోనేటి ఆదిమూలం విమర్శలు చేయడం దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆదిమూలం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సత్యవేడు ఎమ్మెల్యేగా మీ గెలుపునకు పెద్దిరెడ్డి ఆర్థిక సహకారం అందించలేదా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యే టిక్కెట్ పెద్దిరెడ్డి ఇప్పించిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. ఆదిమూలం అన్నా అని ఆప్యాయతగా పిలిచే సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, పార్టీకి వెన్నుపోటు పొడిచావని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి సూచనల మేరకే మీతో కలసి జెండా మోశాం, పార్టీ కార్యక్రమాలకు మా శక్తి కొద్దీ సొంత డబ్బులు ఖర్చు చేసి మండలంలో మీ గెలుపునకు పనిచేశాం, మీ నుంచి ఏనాడు ఏదీ ఆశించలేదన్నారు. నాయకులు రమేష్, గురుప్రసాద్, ఆనందరెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు ఎస్‌కె. మస్తాని, ఎంపీ రవి, సెంధిల్‌కుమార్, శ్రీధర్ రెడ్డి, వంశీ రెడ్డి, పునిథకుమార్, ఈ.గోవిందస్వామి, శ్రీనివాసులు రెడ్డి, మునివేలు, పళణి, శరవణ, శేఖర్, రాబర్ట్, టి.జయ, ఢిల్లిబాబు యాదవ్, టెంకాయల కృష్ణయ్య, కనకరాజ్, సోము,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పిచ్చాటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గత 13 సంవత్సరాల పాటు పదవులు అనుభవించి పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీశ్రేణులు మండి పడ్డారు. ఎమ్మెల్యే ఆదిమూలానికి పార్టీ అధిష్టానం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినా స్వప్రయోజనాల కోసం టీడీపీలో చేరడంపై రెండవ రోజు కూడా నిరసనలు కొనసాగాయి. స్థానిక బైపాస్ కూడలి వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట వైఎస్సార్ సీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. దళిత ద్రోహి ఆదిమూలం.. వైఎస్సార్ సీపీ ద్రోహి ఆదిమూలం, ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్, సింగిల్ విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి మాట్లాడుతూ పదవులు అనుభవించి పార్టీకి వెన్నుపోటు పొడిచారని మండి పడ్డారు. పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాకముందు మీ ఆస్తి ఎంత, ఇప్పుడు మీఆస్తులెంతో అందరికీ తెలుసన్నారు. సర్పంచ్‌లు కేజీ రోజ్ రెడ్డి, భూపతి, సింగిల్ విండో డైరెక్టర్ పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముద్దుకృష్ణమ రాజు, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోవిందన్, ట్రేడ్ యూనియన్ నాయకుడు మునిరాజ, ఎంపీటీసీ సభ్యుడు వేలు, కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, వైస్ సర్పంచ్ శెల్వమురుగన్, నాయకులు దేవరాజులు, మురళీ నాయుడు, ఎత్తిరాజు రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



కరపత్రాలు అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

- వైఎస్సార్ సీపీని ఆదరించండి
- ఎన్నికల ఢంకా మోగించిన బియ్యపు శ్రీవాణిరెడ్డి



యుద్ధానికి సిద్ధం అంటూ ఢంకా వాయిస్తున్న శ్రీవాణిరెడ్డి, పార్టీ శ్రేణులు

శ్రీకాళహస్తి: సీఎం జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం శ్రీవీరభద్రస్వామి ఆలయం వద్ద 2024 సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ప్రచారాన్ని బుధవారం శ్రీవాణిరెడ్డి ఢంకా మోగించి ప్రారంభించారు. ఇందులో భాగంగా తొట్టంబేడు మండలం కొమ్మనగుంట, హరిజనవాడ, గురుకుల పాళెం, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గాబుచేనులో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. సీఎం జగనన్న పథకాల ద్వారా ఎంత లబ్ధి అందిందో వివరించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అనునిత్యం ప్రజాసేవలో ఉంటున్నారని, కరోనా కష్టకాలంలో అండగా నిలిచారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు ఆమెకు తొట్టంబేడు మండలాధ్యక్షుడు ఉన్నం వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సక్కుబాయి, నాయకులు మోహన్, శ్రీనివాసులు, హరి రాయల్, గోపి, సునీల్, వసంత, గోపాల్, రామయ్య, చంద్రయ్యనాయుడు, భాస్కర్, మణినాయుడు, కొన్నలి రమేష్, ఢిల్లీబాబు, భక్తవతల్సం, నరసింహులు, ప్రేమ్‌కుమార్, సాగిరాబీ, రమాప్రభ, ప్రమీలమ్మ, మాధవి, రుషేంద్రమణి, మాధవి, ధనలక్ష్మమ్మ, ఇందిర, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలని మండల విద్యాశాఖాధికారులు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తకండ్రిగ గ్రామ దళితవాడలో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. వారిని ఒప్పించి పాఠశాలకు పంపించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను బడికి పంపితే ప్రభుత్వ పోత్సాహకంగా అమ్మ ఒడి పథకం కింద తల్లికి రూ.14 వేలు ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శ్రీకాళహస్తి న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. బుధవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికి మంచు దెబ్బ



కనమనంబేడు గ్రామంలో పూతరాని మామిడి చెట్లు

బుచ్చినాయుడుకండ్రిగ: పొగమంచుతో మామిడి చెట్లలో పూత రాక పోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కనమనంబేడు, గాజులపెళ్లూరు, కుక్కంబాకం, కంచనపుత్తూరు. ఆలత్తూరు, పీవీకండ్రిగ, బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు, నెలవాయి, వెస్తువరత్తూరు గ్రామాల్లో 400 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో పూత వస్తుంది. పూత వచ్చిన సమయంలో వాతావరణం అనూకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. జనవరి నెలలో వర్షాలు పడడంతో పాటు అధికంగా పొగ మంచు కురుస్తుండడంతో పూత రావడంలో ఆలస్యం నెలకుంటోంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉండావలసిన తోటలు మంచుతో బోసిపోయి కనిపిస్తున్నాయి. పొగమంచు అధికంగా ఉండడంతో తేనె మంచు పురుగు ఆశిస్తోందని రైతులు చెబుతున్నారు.

పత్తాలేని ఉద్యావనశాఖాధికారులు

మామిడి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వలసిన ఉద్యావనశాఖాధికారులు మండలంలో విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మిరప, మామిడి పంటలను ఆశిస్తున్న తెగుళ్ల గురించి తెలియక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పురుగు మందుల డీలర్లపై ఆధారపడుతున్నారు. ఇప్పటికై న ఉద్యావనశాఖాధికారులు మండలంలో పర్యటించి సలహాలు అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

మందులు పిచికారీ చేయాలి

పొగమంచు అధికంగా ఉండడంతో తేనె మంచు పురుగు ఆశిస్తోంది. పిందెలు కాడల రసాన్ని పీల్చడం కారణంగా తోటలకు నష్టం వాటిల్లుతుంది. దీని నివారణకు కాన్ఫిడార్ మందు 0.5 ఎంఎల్, సాఫ్ 2 గ్రాములు, ఫ్లానోఫిక్స్ 0.25 ఎంఎల్ లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.

– భారతి, మండల వ్యవసాయాధికారి

ఏడుగంగమ్మల ఆలయంలో వాస్తు పూజలు



హోమ పూజలు చేస్తున్న అర్చక, వేద పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధంగా ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన ఏడుగంగమ్మల ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా వాస్తుపూజలను నిర్వహించారు. బాలాలయ ఏర్పాట్లలో భాగంగా వాస్తు పూజలు నిర్వహించారు. గురువారం బాలాలయ స్థాపన పూజలు నిర్వహించనున్నారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రైల్వే అధికారి

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవరం సికింద్రాబాద్ సౌత్‌సెంట్రల్ రైల్వే ప్రొటెక్షన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆరోమాసింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.